క్లుప్తంగా

'డబుల్' బాధితులకు న్యాయం చేయాలి



సిరిసిల్లటౌన్: బెడ్ రూం డ్రాలో అర్హులై ఉండి పేర్లురాని బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. పట్టణంలోని నిరుపేదలకు నివాస స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షల అందించాలని గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పేదల లిస్ట్‌ను అందించి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ డ్రాలో రానివారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యం కల్పించి నివేశస్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ. ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అన్నల్‌దాస్ గణేశ్, మోర తిరుపతి, నల్ల బాలు, మోర పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే నిర్భయంగా ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వేములవాడరూరల్: గ్రామాల్లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేసినా, ఉద్యోగాల విషయంలో మోసాలకు పాల్పడినా, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. భూమి తగాదాలతో కొంతమంది మోసాలకు గురిచేస్తున్నారన్నారు. అ లాంటి బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

చందుర్తి: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ హెచ్చరించారు. ఎన్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంఈవో వినయ్ కుమార్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, కృష్ణచైతన్య, సుస్మిత, ఉదయ్ భాస్కర్, కవిత తదితరులున్నారు.

విజయోత్సవ సంబురాలు



రుద్రంగి: మండలంలోని మానాల గ్రామంలో గురువారం కాంగ్రెస్ మండల, గ్రామశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ సంబురాలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాల తొలగింపు



యార్డు నుంచి స్తంభాలు తరలిస్తున్న సెస్ సిబ్బంది

వేములవాడరూరల్: లింగంపల్లి మార్కెట్ యార్డులో ఉన్న విద్యుత్ స్తంభాలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ఎన్నో రోజులుగా అక్కడే ఉన్న స్తంభాల విషయంపై ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. వారంరోజుల్లో స్తంభాలు తొలిగిస్తామని చెప్పిన సెస్ అధికారులు గురువారం అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడ: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సిబ్బంది గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వేములవాడ మెడికల్ ఆఫీసర్లు ఈట లహరిక, ఈట పావని, హాస్పిటల్ సిబ్బంది గౌస్, సౌజన్య, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. శేఖర్, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో కేజీబీవీ బాలికల హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టల్‌ను జిల్లా బీఆర్ఎస్వీ విద్యార్థి ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్ గురువారం గురుకులాల బాటపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.

నిర్మించినా.. అరకొర వసతులే

- వేములవాడ మండల పరిషత్ ఆవరణలో గ్రంథాలయం ప్రారంభం
- పాతకాలం నాటి ఫర్నిచర్, సిబ్బంది కొరత
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పాఠకులు



వేములవాడలో ఇటీవల ప్రారంభమైన గ్రంథాలయం

వేములవాడ : వేములవాడ మండల పరిషత్ ఆవరణలో రూ.3కోట్ల ప్రణాళికతో గ్రంథాలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.1.45 కోట్ల మేర పనులు పూర్తిచేశారు. ఇంకా రూ.1.55 కోట్ల పనులు మిగిలి ఉన్నాయి. దీంతో భవనం బయటి నుంచి బాగానే కనిపిస్తున్నా లోపల ఎలాంటి సౌకర్యాలు లేవు. మరో రూ.2కోట్లు ఖర్చుచేస్తే తప్ప ఈ భవనం సిరిసిల్ల మాదిరి గ్రంథాలయంగా మారే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. జ్ఞానాన్ని పెంచే గ్రంథాలయంపై ఎలాంటి శ్రద్ధ కనబర్చడం లేదంటూ పాఠకులు వాపోతున్నారు. పురాతన కాలంనాటి ఫర్నిచర్, ఎలాంటి బుక్స్ లేకుండా భవనం ఖాళీగా, బాత్‌రూమ్‌లు అధ్వానంగా కనిపిస్తున్నాయి. గతనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కానీ ఇందులో బుక్స్ లేకపోవడంతో పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సరైన సదుపాయాలు లేవు



వేములవాడ గ్రంథాలయం భవనం చూస్తే బాగానే ఉంది. కానీ ఇందులో ఎలాంటి సౌకర్యాలు లేవు. బుక్స్ కూడా లేవు. గ్రంథాలయంలో ప్రభుత్వం కొత్త బుక్స్ ఏర్పాటు చేయాలి.

– స్రవంతి, సాహితీ

ఇద్దరే సిబ్బంది



మొన్నటి వరకు చిన్న గదుల్లో ఉన్న గ్రంథాలయం ఇప్పుడు ఈ భవనంలోకి మార్చాం. ఇద్దరే స్టాఫ్ ఉండటంతో పనులు చేయలేకపోతున్నాం. మరో ఇద్దరు అటెండర్లు, స్వీపర్లు అవసరం ఉంది. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం.

– అనిత, లైబ్రేరియన్

ఎన్నికల హామీలు అమలుచేయాలి



వేములవాడలో బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: ప్రభుత్వం హామీలను మరిచి ప్రజాపాలన పేరిట సంబరాలు జరుపుకోవడం ఏంటని, ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ తీశారు. మహిళలు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయకుండా విజయోత్సవాలా ?



మాట్లాడుతున్న సురేందర్‌రావు

ముస్తాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయకుండా కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు విమర్శించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. రుణమాఫీ పూర్తి చేయలేదని, గృహజ్యోతి అందరికీ రావడం లేదని, రైతు భరోసాపై అన్నదాతలను మోసం చేశారన్నారు. మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన దుబ్బాక రోడ్డు, ముప్పై పడకల ఆస్పత్రిని రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, చెవుల మల్లేశ్, భరత్, కోడె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్లు

కోనరావుపేట: ఈనెల 7న నిర్వహించ తలపెట్టిన ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆల్లె శ్రీనివాస్, మండలాధ్యక్షుడు వీరమల్ల బాపురెడ్డి కోరారు. కోనరావుపేట మండల్ జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అన్నిగ్రామాల ఆటో డ్రైవర్లు, ప్రజలు సహకరించాలన్నారు. ఇక్కడ ఉపాధ్యక్షుడు వేల్పుల తిరుపతి, ప్రధాన కార్యదర్శులు శ్రీను, మధుకర్, కార్యదర్శులు రాజేశం, దయాకర్ మండల జేఏసీ నాయకులు హరీశ్, గ్రామాల అధ్యక్షులు లచ్చయ్య, లింబాద్రి, బాబు, ఉత్తేమ్ శ్రీనివాస్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

బోయినపపల్లి: మండలంలోని వరదవెల్లి శివారులో వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమచారంతో మైనింగ్ ఏడీ, ఇరిగేషన్ ఏఈ హరీశ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌శాఖకు అప్పగించారు. అంతే కాకుండా వరదకాల్వ వద్ద విచారణ చేపట్టినట్లు సమాచారం.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాజిద్



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ అనుబంధ విభాగం యువజన కాంగ్రెస్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో సిరిసిల్లకు చెందిన మాజిద్ ఖాన్ రాష్ట్ర ప్రధాన కార్యదరిగా గెలుపొందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధిక ఓట్లతో (22,020) భారీ విజయం సాధించారు. తన విజయానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భూసారం కాపాడుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, పద్మలత

వేములవాడ: భూసారాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాయిల్ ప్రొటెక్షన్ అండ్ ప్రివెన్షన్ అనే పోటీపరీక్షల్లోని విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి వైద్యులు అభినయ్, పద్మలత, యశశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ అర్బన్: వేములవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల్లో రేషన్ డీలర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆర్డీవో రాజేశ్వర్ గురువారం ప్రకటనలో తెలిపారు. నమిలిగుండుపల్లి, చెక్కపల్లి, జయవరం, అచ్చన్నపల్లి, అనంతపల్లి, కిష్టంపేట్, లింగంపేట్, అజ్మీరాతండా– వట్టిమల్ల, చందుర్తి, నర్సింగాపూర్, చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కోనరావుపేట్, నిమ్మపల్లి, గోవిందరావుపేట్ రత్నంపేట్ గ్రామాల్లో రిజర్వేషన్ల ప్రకారం అర్హత గల అభ్యర్థులు ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు ఆఫీస్ పని దినాల్లో దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని పేర్కొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

వేములవాడ: యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అన్నారు. వేములవాడ గ్రంథాలయానికి ఆయన గురువారం పలు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా 2016 నుంచి వివిధ ప్రాంతాల్లో బుక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పొలాస రాంకిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, మాజీ అధ్యక్షుడు పెంట రాజు, లైబ్రేరియన్ అనిత, పాఠకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **కేజీబీవీలో సౌకర్యాలు కల్పించాలి**

వేములవాడ: వేములవాడ కేజీబీవీలో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో సమస్యలు తెలుసుకున్నట్లు ఆశాఖ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ గురువారం అన్నారు. కేజీబీవీ పాఠశాల రోడ్డు కమాన్ నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు లోపలికి ఉందనీ, అక్కడికి వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం సరిగా లేదన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి కేజీబీవీకి రోడ్డు సౌకర్యం కల్పించడంతోపాటు ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సామల్ల సాయిభరత్, కడారి శివ పాల్గొన్నారు.

● **నేటి నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు**

ఇల్లంతకుంట : సీఎం కప్ క్రీడాపోటీలు ఈనెల 7, 8న గ్రామ పంచాయితీ పరిధిలో 10 నుంచి 12 వరకు మండలస్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వై.శశికళ గురువారం తెలిపారు. 14 ఏళ్ల నుంచి 36 వయస్సుగల వారు అర్హులన్నారు.

● **అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి**

వేములవాడ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ముక్తికాంత అశోక్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. పట్టణంలో చాలామంది నిరుపేదలు ఇల్లు లేనివారు ఉన్నారన్నారు. లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి పేదలకు ఇళ్లు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మల్లారపు ప్రశాంత్, నాయకులు చిలుక బాబు, సాయి భరత్ పాల్గొన్నారు.

● **పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

కోనరావుపేట: మండలంలోని రామన్నపేటకు చెందిన పండుగ రామస్వామి, చెర్ల భాస్కర్ మధ్య దారికోసం గొడవ జరగగా గ్రామపెద్దలు పంచాయతీ నిర్వహించారు. దారిని భాస్కర్ పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. గురువారం జరిగిన పంచాయతీలో భాస్కర్ కుమారుడు వెంకటేశ్ పెద్దలను దూషించాడని రామస్వామి, గ్రామస్తులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

● **ఎమ్మెల్యేను కలిసిన అనిల్‌కుమార్**

బోయినపల్లి: మండల యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని విలాసాగర్‌కు చెందిన ఏనుగుల అనిల్‌కుమార్ గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను అభినందించారు.

ఇల్లంతకుంట : మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్రోజు సంతోష్ కుమార్ గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా సంతోష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు.

● **చికిత్స పొందుతూ రైతు మృతి**

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చింతం బాలమల్లు ఉరఫ్ బాలమల్లయ్య (42) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు. మల్యాలకు చెందిన బాలమల్లు ఈనెల 2న ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగగా కరీంగనర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసుసమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● **మట్టి సంరక్షణలో రైతులు భాగస్వాములు కావాలి**

ఎల్లారెడ్డిపేట: నేలలను సంరక్షిస్తేనే పంట దిగుబడులు పెరుగుతాయని మండల వ్యవసాయాధికారి కవిత పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండలంలోని బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, సింగారంలో రైతులకు మట్టి సంరక్షణపై అవగాహన కల్పించారు.

● **నేడు సంస్మరణ సభ**

సిరిసిల్లటౌన్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాల మల్లేశ్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. గురువారం కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు సీపీఐ ఆఫీస్ కార్మిక భవన్‌లో జరిగే సభకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● **బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలి**

ఎల్లారెడ్డిపేట: ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని మాజీ జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సుభాష్, తదితరులు ఉన్నారు.



మండలంలోని మర్రిగడ్డ శివారులో హరితహారం చెట్ల కొమ్మలను నరికి చెట్ల పక్కనే పడేశారు. దీంతో ఎండిన చెట్ల కొమ్మలకు నిప్పంటుకుని చెట్లు కాలిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నరికిన చెట్ల కొమ్మలను చెట్ల వద్ద నుంచి తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కవిత, పంచాయతీ కార్యదర్శి మర్రిగడ్డ, సెల్ : 7013043086

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

గురుకుల, కేజీబీవీల్లో సమస్యలు పరిష్కరించాలి



గంభీరావుపేట: మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు



ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో ప్రత్యేకాధికారి అంజలికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గంభీరావుపేట: వసతి గృహాలను సందర్శిస్తే ప్రభుత్వానికి భయమెందుకని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్వీ గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి వెంగళ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, కేజీబీవీ, దమ్మన్నపేట మోడల్‌స్కూళ్లను నాయకులు సందర్శించేందుకు వెళ్లగా అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. విద్యాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు భిక్షపతి పటేల్, శంకర్, అరవింద్, మనోజ్, ప్రేమ్‌చారి, వెంకటసాయి, అరుణ్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో గురుకుల బాట చేపట్టారు. అల్మాస్‌పూర్ కేజీబీవీ, వీర్నపల్లిలోని కేజీబీవీ, మోడల్‌స్కూళ్లను సందర్శించారు. బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి వెంగల శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, జిల్లా నాయకులు సింగారం దేవరాజు, తిరుపతినాయక్, కొర్రి అనిల్, ములిగే ప్రమోద్, సిరికొండ నాగరాజు, నిమ్మల బాబు, మందాటి రాము, సయ్యద్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వ గురుకులాల్లో వసతులు కల్పించాలని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆరోపించారు. ముస్తాబాద్ ప్రభుత్వ ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గురుకులాన్ని సందర్శించేందుకు వెళ్తే అధికారులు అడ్డుకున్నారని, వసతులు లేని కారణంగా, గురుకులాల్లో డొల్ల బయట పడుతుందనే తమను అడ్డుకున్నారన్నారు. విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని, సరైన నీటివసతి లేదన్నారు. చలికి వణుకుతున్నారన్నారు. బీఆర్ఎస్ యువజన శాఖ అధ్యక్షుడు శీలం స్వామి, వంగూరి దిలీప్, భరత్, మల్లారెడ్డి, అంజనేయులు, జహంగీర్, శేఖర్, చారి తదితరులు పాల్గొన్నారు.

భూమిని కాపాడుకున్నప్పుడే మానవ మనుగడ



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్: భూమిని కాపాడుకున్నప్పుడే మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నేల దినోత్సవం సందర్భంగా ముస్తాబాద్‌లో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. రైతులు అవగాహన లేకుండా పంటపొలాల్లో వరి కొయ్యకాళ్లను కాల్చడం ద్వారా పంటలకు నష్టం జరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు, పెస్టిసైడ్స్ వాడడంతో ఆహారం విషతుల్యమవుతుందన్నారు. ప్రకృతి రక్షణలో టీడీఎఫ్ జైకిసాన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయమైన సేంద్రియ విధానమే మేలు అని పేర్కొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ట



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మైసమ్మ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

మండలస్థాయి క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లిలో మండలస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగస్వామి, మాజీ సర్పంచ్‌లు కట్కం మల్లేశం, టంపుల సుమన్, మానుపాటి పర్శరాములు, జాగిరి సురేశ్, ఎల్లగౌడ్, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు. పోటీలకు హాజరైన క్రీడలను వారు ప్రారంభించారు.

మట్టి తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

చందుర్తి: మండలంలోని రామన్నపేట తిరుమలలొద్దిలోని గుట్ట ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎర్రం మధుపై చర్యలు తీసుకోవాలని ఇదే గ్రామానికి చెందిన బెంద్రం ఉరఫ్, దుద్యాల లచ్చిరెడ్డి, చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను అక్కడికి పంపగా అధికారి రాకను గమనించి పారిపోతుండగా పట్టుకొని ఫొటోలు తీశారు. మట్టి తరలిస్తున్న వ్యక్తిని ఆర్ఐ శ్రీనివాస్ ఫోన్‌లో ప్రశ్నించగా తమ పట్టా భూమిలో నుంచి తరలిస్తున్నానన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి పట్టా కాగితాలను తీసుకు రావాలని ఆదేశించినట్లు అధికారి తెలిపారు. వారం రోజులుగా తనపట్టా ఉన్న భూమికాకుండా ప్రభుత్వ భూమిలోంచి మట్టితరలిస్తూ, భూమిని చదును చేస్తున్నారని రైతు లచ్చిరెడ్డి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వేములవాడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బోయినపల్లికి చెందిన కారు వేములవాడకు వెళ్తుండగా తిప్పాపూర్ శివారులో గురువారం తెల్లవారుజమున డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. కారులో ఉన్న ముగ్గురు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.